క్లుప్తంగా

రైతుల సమక్షంలో భూముల రీసర్వే

రేగిడి: రైతుల సమక్షంలోనే భూముల రీసర్వే చేపట్టాలని తహసీల్దార్ టి.కల్యాణ చక్రవర్తి సూచించారు. మండలంలోని వన్నలి గ్రామంలో భూముల రీసర్వేపై శుక్రవారం అవగాహన కల్పించారు. ఏళ్ల తరబడి రైతుల మధ్య నెలకొన్న భూ తగాదాల పరిష్కారమే లక్ష్యంగా ప్రభుత్వం భూముల రీసర్వే చేపడుతోందని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఏవైనా భూ సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలని, పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ జి.రమణ, మండల సర్వేయర్లు, గ్రామ సర్వేయర్లు, వీఆర్వోలు పాల్గొన్నారు.

నేడు జోడుబందలలో 'గడప గడపకు మన ప్రభుత్వం'

రేగిడి: మండలంలోని జోడుబందల గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం శనివారం నిర్వహిస్తున్నట్లు వైస్ ఎంపీపీలు టంకాల అచ్చెన్నాయుడు, వావిలపల్లి జగన్మోహనరావు ఓ ప్రకటనలో శుక్రవారం వెల్లడించారు. ఉదయం 8 గంటలకు జరిగే ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కంబాల జోగులు పాల్గొంటారని, మండల స్థాయి పార్టీ నేతలు, కార్యకర్తలు, అధికారులంతా హాజరు కావాలని కోరారు.

అసైన్డ్ భూములు అమ్మరాదు



తునివాడలో అసైన్డ్ భూముల వివరాలపై ఆరాతీస్తున్న ఆర్డీవో అప్పారావు

రేగిడి: అసైన్డ్ భూములను అమ్మరాదని చీపురుపల్లి ఆర్డీవో ఎం.అప్పారావు అన్నారు. మండలంలోని తునివాడ గ్రామంలో రైతులు సాగు చేస్తున్న అసైన్డ్ భూముల వివరాలపై శుక్రవారం ఆరాతీశారు. అసైన్డ్ భూములను సాగు చేసుకోవాలే తప్ప క్రయ,విక్రయాలు చేయకూడదన్నారు. అనంతరం భూముల రీసర్వేపై సమీక్షించి, రైతుల సమక్షంలోనే సర్వే చేయాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ టి.కల్యాణచక్రవర్తి, డీటీవో రాజేశ్వరరావు, వీఆర్వోలు మధు, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యనందించాలి



లోచర్ల ఎంపీపీ స్కూల్‌లో రికార్డులు తనిఖీ చేస్తున్న ఎంఈఓలు త్రినాథరావు, పాపారావు

తెర్లాం: ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులందరికీ నాణ్యమైన విద్యనందేలా చూడాలని ఎంఈవోలు త్రినాథరావు, పాపారావు అన్నారు. శుక్రవారం మండలంలోని లోచర్ల ప్రాథమిక పాఠశాలను సందర్శించిన ఆయన ఉపాధ్యాయ, విద్యార్థుల హాజరు, రికార్డుల నిర్వహణను పరిశీలించారు. ప్రతిరోజూ విద్యార్థులతో వర్క్‌బుక్స్ రాయించాలని, ఉపాధ్యాయులు తప్పనిసరిగా లెస్సన్‌ప్లాన్, డైరీ కలిగి ఉండాలని సూచించారు.

క్రీడాసామగ్రి వితరణ

బాడంగి: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలకు ఇదే పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయుడి(పీడీ)గా పనిచేస్తున్న జి.బంగారునాయుడు రూ.30 వేల విలువైన క్రీడాసామగ్రిని వితరణ చేశారు. సాఫ్ట్‌బాల్ క్రీడకు సంబంధించిన, ఈ సామగ్రిని ప్రధానోపాధ్యాయుడు డి.సత్యనారాయణ చేతులమీదుగా విద్యార్థులకు అందజేశారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం



వంగర: పౌష్టికాహార ప్రయోజనాలపై అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీ సూపర్‌వైజర్ రజనీదుర్గ

తెర్లాం: పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యమని ఐసీడీఎస్ లోచర్ల సెక్టార్ సూపర్‌వైజర్ వెంకటలక్ష్మి అన్నారు. పౌష్టికాహార మాసోత్సవాల్లో భాగంగా మండలంలోని లోచర్లలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారంపై శుక్రవారం అవగాహన కల్పించారు. ప్రతిరోజూ పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉంటారని, రక్తహీనత వంటి వ్యాధులు దరిచేరవన్నారు. గర్భిణులు క్రమం తప్పకుండా ఆరోగ్య తనిఖీలు చేయించుకోవాలని తెలిపారు.

వంగర: మండలంలోని మగ్గూరు-1 అంగన్‌వాడీ కేంద్రంలో వంగర సెక్టార్ ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జి.రజనీదుర్గ పౌష్టికాహార ప్రయోజనాలను వివరించారు. మనం తీసుకునే రోజువారీ ఆహారంలో తప్పనిసరిగా పౌష్టికాహార పదార్థాలు ఉండేలా చూసుకోవాలన్నారు.

రేగిడి: మండలంలోని బూరాడ, సంకిలి, ఉనుకూరు, రేగిడి సెక్టారుల పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆడుకో.. చదువుకో.. కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు శశికళ, నూకాలమ్మలు ప్రీస్కూల్ పిల్లలకు ఆటల ద్వారా చదువుకోవడాన్ని నేర్పించారు. అలాగే పౌష్టికాహార లాభాలను వివరించారు.

ఇంటింటికీ 'సంక్షేమ' ఫలాలు

- గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే కంబాల జోగులు, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్



రేగిడి: ఇంటింటికీ వెళ్లి, సంక్షేమ పాలనను వివరిస్తున్న ఎమ్మెల్యే కంబాల జోగులు, ఎమ్మెల్సీ విక్రాంత్

రేగిడి: ఇంటింటికీ సంక్షేమ ఫలాలు(ప్రభుత్వ పథకాలు) అందిస్తున్న ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానిదేనని ఎమ్మెల్యే కంబాల జోగులు, పాలవలస విక్రాంత్ అన్నారు. మండలంలోని సరసనాపల్లి గ్రామంలో శుక్రవారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలకు గ్రామస్తులు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లిన వారు నాలుగున్నరేళ్లుగా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమం వివరించారు. ఏవైనా సమస్యలున్నా, అర్హులై ఉండి ఎవరికైనా పథకాలు అందకపోయినా వెంటనే తెలియజేయాలన్నారు. ఈ క్రమంలో పలువురు వారి దృష్టికి తీసుకువచ్చిన చిన్నచిన్న సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలోని టీడీపీ పాలనకు ఇప్పటి వైఎస్సార్ సీపీ పాలనకు ఉన్న స్పష్టమైన తేడాను గమనించాలని ప్రజలను కోరారు. టీడీపీ హయాంలో ఏ ఒక్క పథకం కావాలన్నా ఆ పార్టీ నేతలు, కార్యకర్తలకే దక్కేవన్నారు. ప్రస్తుతం అర్హతే ప్రామాణికంగా కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందించడం జరుగుతోందన్నారు. యువతకు నైపుణ్య శిక్షణ ఇచ్చి, ఉపాధి అవకాశాలు కల్పిస్తానని చెప్పి స్కిల్ స్కాం చేసిన ఘనుడు చంద్రబాబు అని, ఆయన పచ్చిమోసకారి అని ఆయనను ఎవరూ నమ్మవద్దన్నారు. ఎమ్మెల్సీ మాట్లాడుతూ ఎన్నికలకు ముందు మాత్రమే టీడీపీ హామీలు ఇస్తుందని, తీరా అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని అమలు చేయడం మర్చిపోతుందన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మాత్రం అలా కాదని, తాను ఎన్నికల ముందు ఇచ్చిన ప్రతీ హామీని నెరవేర్చారన్నారు. అలాగే నవరత్నాల పేరిట ఇచ్చిన పథకాలతో పాటు అన్ని వర్గాలకు మేలు జరిగేలా మరెన్నో పథకాలు రూపొందించి, అందిస్తున్నారన్నారు. ప్రభుత్వ పథకాలతో ప్రజల జీవన ప్రమాణాలు మెరుగయ్యాయన్నారు. ఇదే సంక్షేమ పాలన కొనసాగాలంటే వచ్చే ఎన్నికల్లోనూ ఇదే ప్రభుత్వాన్ని అధికారంలోకి తీసుకురావాలని, సీఎం జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ కోరారు.

కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు టంకాల అచ్చెన్నాయుడు, వావిలపల్లి జగన్మోహనరావు, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ గేదెల వెంకటేశ్వరరావు, సర్పంచ్ కర్రి అప్పలనాయుడు, ఎంపీటీసీ కెల్ల మన్మథరావు, రేగిడి పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు నెల్లి పెంటన్నాయుడు, ఎంపీడీవో శ్యామలదేవీ, తహసీల్దార్ టి.కల్యాణచక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ బీమా తక్షణ సాయం అందజేత



వంగర: బాధిత కుటుంబానికి వైఎస్సార్ బీమా సాయం అందజేస్తున్న సర్పంచ్ కళావతి



రేగిడి: బాధితురాలికి తక్షణ సాయంగా రూ.10 వేలను అందజేస్తున్న సర్పంచ్ చంద్రశేఖర్

వంగర: మండలంలోని ఎం.సీతారాంపురానికి చెందిన తాపీమేస్త్రీ కలిగి నారాయణరావు ఇటీవల విద్యుత్ షాక్‌తో చనిపోయిన విషయం తెలిసిందే. ఈ మేరకు ఆయన భార్య నిర్మలకు వైఎస్సార్ బీమా తక్షణ సాయం కింద రూ.10 వేలను సర్పంచ్ కళావతి చేతులమీదుగా శుక్రవారం అందజేశారు. మిగిలిన రూ.90 వేలు పది రోజుల్లో బ్యాంకు ఖాతాలో జమ చేయడం జరుగుతుందని సర్పంచ్ తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేత బి.ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

రేగిడి: మండలంలోని మునకవలస గ్రామానికి చెందిన గార మాణిక్యమ్మ ఇటీవల మృతి చెందగా, నామినీ అయిన అప్పలనరసమ్మకు వైఎస్సార్ బీమా తక్షణ సాయంగా రూ.10 వేలను సర్పంచ్ వావిలపల్లి చంద్రశేఖర్ చేతులమీదుగా శుక్రవారం అందజేశారు. మిగిలిన మొత్తాన్ని నామినీ బ్యాంకు ఖాతాలో జమ చేయడం జరుగుతుందని సర్పంచ్ తెలిపారు.

• పింఛన్ల పండగ

గ్రామగ్రామాన కొత్త పింఛన్ల పంపిణీ ఓ పండగలా జరుగుతోంది. ప్రజాప్రతినిధులు, అధికారుల చేతులమీదుగా లబ్ధిదారులకు పింఛన్ నగదు అందజేస్తున్నారు. ప్రజాసంక్షేమమే పరమావధిగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన కొనసాగిస్తున్నారని, ప్రతీ వర్గానికి మేలు జరిగేలా ఆయన పథకాలు రూపొందించి, అమలుచేస్తున్న తీరు దేశానికే ఆదర్శమని లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కొత్తగా పెన్షన్ పొందిన వారు సైతం ఇదే ప్రభుత్వం మళ్లీ మళ్లీ రావాలని నినదిస్తుండడం విశేషం. - సాక్షి నెట్‌వర్క్



రాజాంలో కొత్తవారికి మంజూరైన పింఛన్లు అందజేస్తున్న ఎమ్మెల్యే కంబాల జోగులు, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్



వంగర: పింఛన్లు అందజేస్తున్న ఎంపీపీ సురేష్‌ముఖర్జీ



రాజాం: అంతకాపల్లిలో పింఛన్లు పంపిణీ చేస్తున్న సర్పంచ్ చిన్నంనాయుడు



వంగర: బాగెంపేటలో పింఛన్లు అందుకున్న ఆనందంలో లబ్ధిదారులు

మట్టి విగ్రహాల పంపిణీ



రాజాం సిటీ: మట్టి ప్రతిమలు పంపిణీ చేస్తున్న వాసవీ క్లబ్ సభ్యులు

రాజాం సిటీ: స్థానిక పట్టణంలో మట్టి వినాయక విగ్రహాలను వాసవీ క్లబ్ మనరాజాం-సారధి సభ్యులు శుక్రవారం పంపిణీ చేశారు. ఈ నెల 18వ తేదీన వినాయక చవితి పురస్కరించుకుని, పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా తమవంతు సాయంగా మట్టి విగ్రహాలను ఉచితంగా అందజేస్తున్నట్లు సంస్థ అధ్యక్షుడు గ్రంధి రవికుమార్ తెలిపారు. ఇప్పటి వరకు 700 మట్టి ప్రతిమలతో పాటు పుస్తకాలను కూడా అందజేశామని, ప్రతిఒక్కరూ మట్టి విగ్రహాన్నే పూజించాలని కోరారు. కార్యక్రమంలో వి.రాజ, పి.రాజు తదితరులు పాల్గొన్నారు.

బొబ్బిలి: మండలంలోని అలజంగి గ్రామంలో జనవిజ్ఞాన వేదిక బొబ్బిలి శాఖ ఆధ్వర్యంలో మట్టి వినాయక విగ్రహాల పంపిణీ శుక్రవారం జరిగింది. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలు మాని, ప్రతిఒక్కరూ మట్టి విగ్రహాలనే పూజించాలని జనవిజ్ఞాన వేదిక బొబ్బిలి అధ్యక్షుడు ఎస్.శ్రీనివాసరావు కోరారు.

రాజాం సిటీ: స్థానిక పాలకొండ రోడ్డులోని ధన్వంతరి విద్యాగణపతి ఆలయంలో ఈ నెల 18వ తేదీ నుంచి 26వ తేదీ వరకు గణేష్ నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు అర్చకులు బి.అనంతలింగం శుక్రవారం తెలిపారు. ప్రతిరోజూ ప్రత్యేకాభిషేకాలు, గణపతి హోమాలు నిర్వహించనున్నామన్నారు.

ప్రకృతి సేద్యంతో అధిక దిగుబడులు



రేగిడి: చాటాయివలసలో ప్రకృతి వ్యవసాయి పద్ధతులపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

రాజాం: ప్రకృతి సేద్యంతో అధిక దిగుబడులు వస్తాయని ప్రకృతి వ్యవసాయం యూనిట్ ఇన్‌చార్జ్ పి.రమాదేవి, ఐసీఆర్‌పీ వై.నిర్మల అన్నారు. శుక్రవారం మండలంలోని పొగిరిలో ప్రకృతి వ్యవసాయ విధానాలు అవలంభిస్తూ సాగు చేస్తున్న పంట పొలాలను వారు పరిశీలించారు. అనంతరం సాగులో అధిక దిగుబడుల సాధనకు పలు సలహాలు, సూచనలు చేశారు. అలాగే పొలంగట్లపై కంది, బంతి, వంగ, టమాటా, చిక్కుడు, బెండ, మునగ మొక్కల పెంపకాన్ని వివరించి, ద్రవజీవామృతం తయారీ, దాని ప్రయోజనాలు వివరించారు.

రేగిడి: మండలంలోని చాటాయివలస గ్రామంలో శుక్రవారం నిర్వహించిన వైఎస్సార్ పొలంబడి కార్యక్రమం నిర్వహించి, సాగులో యాజమాన్య పద్ధతులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, రసాయనిక ఎరువుల వినియోగం, సేంద్రియ, ప్రకృతి వ్యవసాయ విధానాలను వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ కె.గోవిందరావు, ఐసీఆర్‌పీలు పి.తవిటినాయుడు, రమణ తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛ గ్రామాలే లక్ష్యం



రాజాం సిటీ: పంచాయతీ కార్యదర్శులకు చెత్త సేకరణ బుట్టలు అందజేస్తున్న ఎంపీడీవో శంకరరావు

రాజాం సిటీ: ప్రతీ గ్రామాన్ని స్వచ్ఛమైన గ్రామంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని ఎంపీడీవో బాసూరి శంకరరావు అన్నారు. శుక్రవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో పలు గ్రామాలకు సంబంధించి, చెత్త సేకరణ బుట్టలను పంచాయతీ కార్యదర్శులకు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మండలానికి మొత్తం 23,120 వచ్చాయని, వీటిని గ్రామాల్లో పంపిణీ చేయనున్నామన్నారు. కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ వి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

లక్ష్య సాధనకు కృషి చేయాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న మోటివేషనల్ ట్రైనీ శ్రీదేవి

సంతకవిటి: విద్యార్థులు తమ లక్ష్య సాధనకు కృషి చేయాలని సారధి వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ మోటివేషనల్ ట్రైనీ పొట్టా శ్రీదేవి కోరారు. శుక్రవారం మండలంలోని మందరాడ జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు మోటివేషన్ తరగతులు నిర్వహించిన ఆమె లక్ష్యాలు అధిగమించాలంటే శ్రమ, ఓర్పు, సహనంతో పాటు క్రమశిక్షణ కూడా చాలా అవసరమన్నారు. టైమ్‌టేబుల్ పెట్టుకుని మరీ ప్రణాళికాబద్ధంగా చదివితే ఆరోగ్యంతో పాటు చదువులో కూడా ఉత్తమ ఫలితాలు రాబట్టవచ్చన్నారు. మహనీయుల జీవిత చరిత్రలు చదివి, అందులోని జీవిత సత్యాలను గ్రహించాలన్నారు. చెడు స్నేహాన్ని విడిచిపెట్టాలని, గెలుపు, ఓటములను సమానంగా తీసుకోవాలన్నారు. తాను వాసవీక్లబ్ ఇంటర్నేషనల్ అధ్యక్షులు పి.గాయత్రి, గవర్నర్ ఆత్మకూరి సతీష్‌ల గైడెన్స్‌లో మోటివేషన్ ట్రెనింగ్ పొందుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జ్ హెచ్‌ఎం పి.గౌరినాయుడు, పి.ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఏఎస్‌డబ్ల్యూవో సందర్శన

బొబ్బిలి: మండలంలోని కోమటిపల్లి, కలువరాయి, పిరిడి ప్రాంతాల్లోని బీసీ వసతిగృహాలను ఏఎస్‌డబ్ల్యూవో శ్యామలాకుమారి శుక్రవారం రాత్రి సందర్శించారు. అక్కడి విద్యార్థులకు అందిస్తున్న విద్య, కల్పిస్తున్న సదుపాయాలు, భోజనంను పరిశీలించారు. అనంతరం విద్యార్థుల నైట్ స్టడీ అవర్‌ను పరిశీలించి, పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని, బాగా చదవాలని విద్యార్థులకు సూచించారు. విద్యార్థులకు ఏ లోటు లేకుండా చూడాలని వసతిగృహ సంక్షేమాధికారి శ్రీనివాసరెడ్డిని ఆదేశించారు.

కారాడలో 'పొలంబడి'

బొబ్బిలి: మండలంలోని కారాడ గ్రామంలో వైఎస్సార్ పొలంబడి కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. సాగులో అధిక దిగుబడుల సాధనకు వ్యవసాయ వనరుల కేంద్రం విజయనగరం ఏడీ డి.భారతి పలు సూచనలు, సలహాలు చేశారు. అలాగే సేంద్రియ వ్యవసాయం వైపు రైతులు దృష్టిసారించాలని తెలిపారు. రసాయనిక ఎరువుల వాడకం తగ్గించి, సహజ ఎరువులను వినియోగించాలని కోరారు. అనంతరం సేంద్రియ వ్యవసాయ ధ్రువపత్రాల జారీకి సంబంధించి, రిజిస్టర్ల నమోదు బుక్‌లెట్లను రైతులకు అందజేశారు. కార్యక్రమంలో ఏడీ మజ్జి శ్యామసుందరరావు తదితరులు పాల్గొన్నారు.

• స్వాగతం.. సుస్వాగతం!





ప్రభుత్వ వైద్య కళాశాల ప్రారంభోత్సవానికి శుక్రవారం విజయనగరానికి విచ్చేసిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఎమ్మెల్యేలు కంబాల జోగులు, శంబంగి వెంకట చినఅప్పలనాయుడు పుష్పగుచ్ఛాలు అందజేసి, స్వాగతం పలికారు. -ఫొటోగ్రాఫర్, విజయనగరం.

'జగనన్న ఆరోగ్య సురక్ష' ప్రారంభం



బొబ్బిలి: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ప్రారంభించి, బ్రోచర్‌ను విడుదల చేస్తున్న ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు

ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించడమే లక్ష్యంగా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. మండలాలు, పట్టణాల్లోని వైఎస్సార్ సీపీ నేతలు ఈ కార్యక్రమాన్ని శుక్రవారం లాంఛనంగా ప్రారంభించారు. తొలుత వలంటీర్లు తమకు కేటాయించిన ఇళ్లకు వెళ్లి, కార్యక్రమ ముఖ్య ఉద్దేశ్యాన్ని వివరిస్తారు. అనంతరం వైద్యారోగ్య సిబ్బంది ప్రతీ ఇంటికి వెళ్లి, అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వారి వివరాలు సేకరిస్తారు. ఇలా 15 రోజుల పాటు సర్వే చేసిన తర్వాత ఈ నెల 30వ తేదీ నుంచి ప్రాంతాల వారీగా నిర్వహించే జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాల్లో రోగులకు ఆరోగ్య తనిఖీలు, చికిత్స, వైద్యసేవలు, మందులు అందేలా చూస్తారు. ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని నేతలు కోరారు. – సాక్షి నెట్‌వర్క్



తెర్లాం: కార్యక్రమంపై అవగాహన కల్పిస్తున్న ఎంపీపీ ఉమాలక్ష్మి



రాజాం సిటీ: రాజయ్యపేటలో జగనన్న ఆరోగ్య సురక్ష సర్వేలో వలంటీర్లు, అధికారులు



బాడంగి: పిన్నవలసలో వలంటీర్లు చేస్తున్న సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీవో ఆంజనేయులు



వంగర: కార్యక్రమం గురించి వివరిస్తున్న ఎంపీపీ సురేష్‌ముఖర్జీ



రాజాం సిటీ: దోలపేట జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల కళ్లను తనిఖీ చేస్తున్న ఆప్తాలమిక్ అధికారి వసంతరావు

క్రీడలతో మానసికోల్లాసం

- ఎంపీపీ రెడ్డి సన్యాసినాయుడు



మెంటాడ: ఆటల పోటీలను ప్రారంభిస్తున్న ఎంపీపీ సన్యాసినాయుడు

మెంటాడ: క్రీడలతోనే మానసిక, శారీరక ఉల్లాసం కలుగుతుందని ఎంపీపీ రెడ్డి సన్యాసినాయుడు అన్నారు. మండలంలోని చల్లపేట జెడ్పీ ఉన్నత పాఠశాలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మండల స్థాయి క్రీడాపోటీలను ఎంపీపీ శుక్రవారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆటలో గెలుపోటములు సహజమని, ఓడినా.. గెలిచినా.. క్రీడాస్ఫూర్తి కనబరచాలన్నారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, షటిల్, బాల్‌బ్యాడ్మింటన్, త్రోబాల్, అథ్లెటిక్స్ పోటీలు నిర్వహిస్తున్నట్లు పీడీ శ్రీనివాస్ తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు ఎస్. ఈశ్వరరావు, పి.దుర్గ తదితరులు పాల్గొన్నారు.

రాజాం: స్థానిక జీఎంఆర్ఐటీ మైదానంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మండల స్థాయి యోగా పోటీలు శుక్రవారం నిర్వహించారు. ఈ పోటీలకు మండలంలోని పొగిరి, రాజాం, డోలపేట, కంచరాం, బొద్దాం, గార్రాజుచీపురుపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలల విద్యార్థులతో పాటు గురవాం కేజీబీవీ విద్యార్థులు హాజరయ్యారు. పొగిరి జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు జ్యోత్స్న, అపర్ణ, సుస్మిత, శాంతిప్రియ, లావణ్య, మహాలక్ష్మి నియోజకవర్గ స్థాయి యోగా పోటీలకు అండర్-14, అండర్-17 విభాగాల్లో ఎంపికయ్యారు.

ఘనంగా ఇంజినీర్స్ డే

బొబ్బిలి: మండలంలోని కోమటిపల్లి తాండ్రపాపారాయ పాలిటెక్నిక్ కళాశాలలో ఇంజినీర్స్ డే శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రపంచ ప్రఖ్యాత ఇంజినీర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి, ఘననివాళులర్పించారు. అనంతరం ఆయన సేవలను వక్తలు కొనియాడారు. భారత ఇంజినీరింగ్ రంగానికి ఊపిరిపోసిన మహామేధావి, ప్రపంచంలో భారత ఖ్యాతిని నిలిపిన మహనీయుడు విశ్వేశ్వరయ్యన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎన్.సుధీర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

రామభద్రపురం: మండలంలోని నాయుడువలస ప్రాథమికోన్నత పాఠశాలలో ఇంజినీర్స్ డే శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మనబడి నాడు-నేడు పనులు పారదర్శకంగా జరిగేలా కృషి చేసిన ఇంజినీరింగ్ అసిస్టెంట్ కె.వాసుదేవరావును పాఠశాల సిబ్బంది ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు ఎ.నాగభూషణరావు తదితరులు పాల్గొన్నారు.